# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ◆ 11 ◆ డిసెంబర్ ◆ 2024






**ఇక దూసుకుపోవడమే..**

ఇల్లెందులో రెండు ప్రధాన రోడ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు మున్సిపల్ పాలకవర్గం, అధికారులు దృష్టి సారించారు.

10లో



**మిగిలింది నాలుగు నెలలే..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడగా, వచ్చే నాలుగు నెలల్లో లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారు.

12లో

**వాతావరణం**

గరిష్టం / కనిష్టం
28° / 17°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమల పాకులతో అర్చన గావించారు.

### న్యాక్ బృందాన్ని కలిసిన కలెక్టర్



న్యాక్ చైర్మన్, సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

**అశ్వాపురం:** మండల పరిధిలోని మిట్టగూడెం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(న్యాక్) బృందం రెండో రోజు మంగళవారం సందర్శించింది. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, సౌకర్యాలను బృందం సభ్యులు పరిశీలించారు. న్యాక్ చైర్మన్ ప్రొఫెసర్ ఎల్లప్ప మునిరాజ్, సభ్యులు లాల్రిన్ తుంగ, దిలీఫ్‌సేథ్ కళాశాలలో రెండు రోజులుగా సేకరించిన అంశాలపై నివేదిక సిద్ధం చేశారు. కాగా, మణుగూరులో ఇల్లెందు అతిథి గృహంలో న్యాక్ బృందాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యాబోధన, సౌకర్యాలను వారికి వివరించారు.

### అడవుల అభివృద్ధికి కృషి



కనకగిరి అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ తదితరులు

**జూలూరుపాడు:** అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తున్నామని డీఎఫ్‌ఓ జి.కిష్టాగౌడ్ అన్నారు. జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో అటవీశాఖకు కేటాయించిన ఐదెకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆ తర్వాత సూరారం అటవీ బీట్‌లోని ప్లాంటేషన్‌తోపాటు కనకగిరి అడవులను పరిశీలించారు. అడవులు, వన్య ప్రాణుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, జూలూరుపాడు ఎఫ్ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, పీఆర్ డీఈ సత్యనారాయణ, ఆర్ఐ ఎం. తిరుపతిరావు, సర్వేయర్ శివకృష్ణ, ఎఫ్ఎస్‌ఓ హనుమంతు, బీట్ ఆఫీసర్ వి. శ్రీలత పాల్గొన్నారు.

### నేడు 'భారజల' సమావేశం

**అశ్వాపురం :** మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీ అతిథి గృహంలో బుధవారం మణుగూరు భారజల కర్మాగారం ఆఫ్‌సైట్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ చైర్మన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరుకానున్నారు. భారజల కర్మాగారం పరిధిలోని గ్రామాల్లో చేపడుతున్న రక్షణ చర్యలపై సమీక్షించనున్నారు.

# కూపన్ల గోల్‌మాల్!



రోడ్డుపై ధాన్యం ఆరబోస్తున్న మహిళా రైతు

జిల్లా వ్యాప్తంగా 5.89 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా ఇందులో అటవీ హక్కుల చట్టం కింద వచ్చిన భూములు 2.20 లక్షల మేర ఉన్నాయి. మరో 50 వేల ఎకరాలు పట్టా లేని ప్రభుత్వ భూములు సాగులో ఉన్నాయి. ఇవి కాకుండా ఏజెన్సీ ప్రాంతం కావడంతో పట్టాలు లేకుండా గిరిజనేతరులు సాగు చేస్తున్న భూములు కూడా ఉన్నాయి. ఇలా పలు రకాల క్షేత్రాల్లో పండిన ధాన్యం, పత్తి సేకరణకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

**కౌలు పేరిట పరిమితికి మించి జారీ**

- కూపన్ల అండతో చెలరేగిపోతున్న దళారులు
- తక్కువ ధరకే రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లు
- పక్కదారి పడుతున్న సన్న ధాన్యం బోనస్

**కొనుగోలు ప్రక్రియ ఇలా..**

వ్యవసాయ ఉత్పత్తిలో నిర్దేశిత ప్రమాణాలు ఉన్నాయని నిర్ధారించిన తర్వాత సదరు పంట అమ్ముకోవడానికి ఆ క్లస్టర్‌కు చెందిన వ్యవసాయ విస్తరణాధికారి కూపన్ జారీ చేస్తారు. ఉదాహరణకు వరికైతే ధాన్యంలో తేమ 17 శాతానికి వచ్చిన తర్వాత కూపన్ జారీ అవుతుంది. ఇలా నిర్దేశిత ప్రమాణాలు వచ్చే వరకు ధాన్యాన్ని రైతులు ఆరబెట్టాల్సిందే. కూపన్ జారీ అయ్యాక ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకెళ్తారు. అక్కడ తూకం వేసిన తర్వాత బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు, పట్టాదార్ పాసు పుస్తకం, బ్యాంక్ లింక్డ్ ఫోన్ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలో నగదు జమవుతుంది. ఇందులో ఏ వివరాలు లేకపోయినా అమ్మడం వీలుకాదు. కొనుగోలు కేంద్రాల్లో పట్టాదార్ పాసు పుస్తకం ఎంతో కీలకం.

**కల్లాల వద్దే కొనుగోళ్లు..**

సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి పేరుతో కొందరు వ్యాపారులు రంగంలోకి దిగుతున్నారు. రైతులతో కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఫలితంగా మద్దతు ధర కంటే తక్కువకే రైతులు వీరికి తమ పంట ఉత్పత్తులను అమ్మాల్సి వస్తోంది. మరోవైపు రెండు మూడు ఎకరాల్లో సాగు చేసుకునే చిన్న, సన్నకారు రైతులపైనా వీరు దృష్టి సారిస్తున్నారు. నేరుగా కల్లాలవద్దే పచ్చి వడ్లు కొనేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసే ధాన్యానికి మద్దతు ధర కంటే తక్కువగా చెల్లిస్తున్నారు. ఆ పంటలను రెండు వారాల పాటు ఆరబెట్టి తేమ శాతం తగ్గిన తర్వాత ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముతూ మద్దతు ధరతో పాటు బోనస్ కూడా పొందుతున్నారు.

**ఎన్‌డీఎస్ కూపన్లతో..**

పట్టాదార్ పాసు పుస్తకం లేని భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు నాన్ డిజిటల్ సైన్ కూపన్లను ఆ ఏరియా వ్యవసాయ శాఖ బాధ్యులు జారీ చేస్తారు. ఈ కూపన్ల ద్వారా పట్టా లేని రైతులు కూడా తమ ఉత్పత్తులను విక్రయించే అవకాశం ఉంది. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని దళారులు కౌలు రైతుల అవతారం ఎత్తి ప్రభుత్వ బోనస్‌ను అప్పనంగా బొక్కేస్తున్నారు. ఈ క్రమంలోనే ముందు వడ్డీ వ్యాపారుల అవతారం ఎత్తుతున్నారు.

**నజర్ పెట్టాల్సిందే..**

కనీసం నాలుగు నెలలు రేయింబవళ్లు శ్రమించిన రైతులకు కనీస మద్దతు ధర దక్కకపోగా కేవలం కూపన్ల ఆధారంగా రెండు మూడు వారాల్లోనే దళారులు, వడ్డీ వ్యాపారులు లక్షల్లో ఆర్జిస్తున్నారు. సీజన్ తిరిగేసరికి కోటీశ్వరులవుతున్నారు. పత్తి అమ్మకాల విషయంలో ఇప్పటికే ఈ వ్యూహం విజయవంతం కావడంతో ఇప్పుడు రూ.500 బోనస్ అదనంగా వస్తుండటంతో వరిపైనా కన్నేశారు. ఆరంభంలో వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద మొదలయ్యే ఈ అవినీతి వ్యవహారం.. కొనుగోలు కేంద్రాల్లో కొందరు సిబ్బంది చేతివాటంతో ముగుస్తోంది. మధ్యలో కొందరు మిల్లర్లు సైతం ఈ దందాలో భాగస్వాములవుతున్నారు. కూపన్ల జారీలో జరుగుతున్న అక్రమాలపై ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

**కూపన్లలో అక్రమాలు లేవు**

కౌలు రైతులు, డిజిటల్ సర్వేలో పట్టాలు అందని భూములకు ప్రత్యేకంగా కూపన్లు జారీ చేస్తున్నాం. వీటి ద్వారా కొనుగోలు కేంద్రాల్లో తమ ఉత్పత్తులు విక్రయించుకోవచ్చు. కూపన్ల జారీలో అవినీతి జరిగినట్టు నా దృష్టికి రాలేదు.

– వి.బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# ముక్కోటి ఏర్పాట్లు పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన అధికారులు

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ఉత్సవాలకు అనుసంధానంగా పర్యాటకాభివృద్ధి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాచలం :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జనవరి 10న ముక్కోటి ఏకాదశి వేడుకల నిర్వహణకు అవసరమైన పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూడాలన్నారు. వేడుకల ఏర్పాట్ల పర్యవేక్షణను భద్రాచలం ఆర్డీఓ, బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ శాఖ సంయుక్తంగా చేపట్టాలన్నారు. లాడ్జీలు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించి ధరలు నిర్ణయించాలని ఆర్డీఓకు సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. భద్రాచలంతో పాటు పర్ణశాల ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఉత్తర ద్వార దర్శన మహోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయాలని, తెప్పోత్సవానికి హంస వాహనాన్ని తనిఖీ చేసి ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఈఈకి సూచించారు. హంస వాహనంలోకి పరిమిత సంఖ్యలోనే అనుమతించాలని, ప్రమాదాలు జరుగకుండా చూడాలని అన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని ఆహార తనిఖీ, తూనికలు, కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. భద్రాచలం, పర్ణశాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని, బస్సులు, రైల్వే సమయాలతో పాటు జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలను తెలియజేసేలా చార్టులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కరకట్ట వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో అలసత్వం వహించిన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో గుంతలు పడిన రోడ్డును రెండు రోజుల్లో వెట్ మిక్సర్‌తో పూడ్చాలని ఆదేశించారు.

**పర్యాటకాభివృద్ధికి కృషి చేయండి..**

ముక్కోటి ఉత్సవాలకు అనుసంధానంగా భద్రాచలాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. భద్రాద్రి ప్రాముఖ్యతపై రాష్ట్రస్థాయి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన సంప్రదాయ వంటకాలు, వస్తువులు ప్రతిబింబించేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో భద్రాచలం ప్రాముఖ్యత తెలిపేలా వాల్‌పోస్టర్లు వేసేందుకు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. భద్రాచలంలో గిరిజన మ్యూజియం, దుమ్ముగూడెంలో గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాట్లు, కిన్నెరసానిలో పుట్టి ప్రయాణం, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, ఆలయ ఈఓ రమాదేవి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్**



లోక్ అదాలత్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి, తదితరులు

**కొత్తగూడెంఅర్బన్:** జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరగా, రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని, న్యాయార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం కోర్టు లైబ్రరీ హాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సత్వర సహకారం అందించాలన్నారు. రాజీ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారం అయితే న్యాయవ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ బెంచ్, బార్ న్యాయవ్యవస్థకు రెండు చక్రాల వంటివని, న్యాయవాదుల సహకారమే కేసుల రాజీ పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ బి.రామారావు, న్యాయమూర్తులు ఎ.సుచరిత, కె.సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**14న మెగా హెల్త్ క్యాంప్..**

కొత్తగూడెం బార్ అసోసియేషన్, ఆనంది మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఈనెల 14న మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, లా, కోర్టు డ్యూటీ అధికారులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తులు బి.రామారావు, సుచరిత, సాయిశ్రీ, కార్యవర్గ సభ్యులు తోట మల్లేశ్వరరావు, సాధిక్ పాషా, దూదిపాల రవికుమార్, నల్లమల్ల ప్రతిభ, ఆస్పత్రి యాజమాన్యం జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే.. సాగేదెలా !?

- కార్యదర్శులకు సవాల్‌గా 'ఇందిరమ్మ' దరఖాస్తుల సర్వే
- అర్హుల ఎంపిక బాధ్యత తమకు వద్దంటున్న వైనం
- మినహాయింపు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి
- జిల్లాలో మొక్కుబడిగానే ఇందిరమ్మ కమిటీలు



కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

**చుంచుపల్లి :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపికకు చేపట్టనున్న యాప్ సర్వేపై సందిగ్ధం నెలకొంది. లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ యాప్ అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే అర్హుల ఎంపిక బాధ్యతను ఇందిరమ్మ కమిటీలకు, అధికారులకు కాకుండా పంచాయతీ కార్యదర్శులకే అప్పగించడంతో వారికి ఇది సవాల్‌గా మారింది. సర్వే యాప్‌లోని 4వ కాలమ్‌లో అర్హులు/అనర్హులు అనే ఆప్షన్ తామే ఇవ్వాల్సి రావడం వారికి ఇబ్బంది కలిగిస్తోంది. దీంతో లబ్ధిదారుల ఎంపికకు కార్యదర్శులు వెనకాడుతుండడంతో జిల్లాలో సర్వే ప్రక్రియ ఇంకా ప్రారంభమే కాలేదు. ఈ విషయంలో ఏదో ఒకటి తేల్చాలని కోరుతూ మంగళవారం పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో పాటు డీపీఓను కలిసి వినతిపత్రం అందించారు. స్థానికంగా విధులు నిర్వహిస్తూ అదే గ్రామంలో అర్హులను గుర్తించడం కష్టంగా ఉందని, సర్వే యాప్ నుంచి ఎంపిక ఆప్షన్‌ను తొలగించాలని లేదా తమను బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్నారు.

**మొక్కుబడిగానే ఇందిరమ్మ కమిటీలు..**

నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు క్రియాశీలక పాత్ర పోషించిన ఇందిరమ్మ కమిటీలను మళ్లీ తెరపైకి తెచ్చింది. గత అక్టోబర్‌లో జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, 103 మున్సిపల్ వార్డుల్లో కమిటీలు వేశారు. అయితే వీటి ఏర్పాటులో ఎక్కడా పారదర్శకత పాటించలేదనే ఆరోపణలు వచ్చాయి. ఎమ్మెల్యేలు, స్థానిక పార్టీ నాయకులు సూచించిన పేర్లనే కమిటీల్లో చేర్చారనే విమర్శలు ఉన్నాయి. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ఈ కమిటీలు పనిచేయాల్సి ఉంది. ప్రస్తుతం సర్పంచ్‌లు లేనందున కమిటీలో ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉన్నారు. వీరితో పాటు డ్వాక్రా సంఘాల మహిళలు ఇద్దరు, గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరి చొప్పున స్థానం కల్పించారు. మున్సిపాలిటీల్లో ఆయా వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా కొనసాగుతారు. గ్రామాల్లో నియమించినట్లుగానే ఐదుగురు సభ్యులు ఉంటారు. గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ కమిటీలు అర్హులను ఎంపిక చేయాలని ప్రభుత్వం మొదట ఆదేశించింది. అయితే ప్రస్తుతం ఈ పద్ధతి కాకుండా యాప్ ద్వారా కార్యదర్శులకే అర్హుల ఎంపిక బాధ్యతలు అప్పగించడంతో వారు నిరాకరిస్తున్నారు.

**పని ఒత్తిడితో సతమతం..**

పంచాయతీ కార్యదర్శులు నిత్యం పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. పని దినాలతో పాటు అదనంగా ఆదివారాలు, పండగ రోజుల్లోనూ పనిచేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. నిత్యం ఉదయం 7 గంటలకే విధులకు హాజరై డీఎస్ఆర్ పద్ధతిలో రహదారులు, డ్రెయినేజీలు, శానిటేషన్ వంటి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోందని, ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవడంతో అన్ని పనులూ తామే చూసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీల్లో నిధుల కొరతతో రోజువారీ పనులకు తామే పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని అంటున్నారు. అనేక పనులతో మానసికంగా, శారీరకంగా అలసిపోతున్న తమను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్నారు.

**అర్హుల ఎంపిక సవాల్‌గా మారనుంది**



ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేలో అర్హులు, అనర్హులు అనే ఆప్షన్ తీసేయాలి. ఇది మాకు సవాల్‌గా మారడమే కాకుండా కొన్ని సమస్యలు ఎదురవుతాయి. ఈ ప్రక్రియలో అర్హులను గుర్తించే పూర్తి బాధ్యతలు ఇందిరమ్మ కమిటీలకే ఇవ్వాలి. సర్వేల సమయంలో అదనపు విధులు నిర్వరిస్తున్నందున గౌరవ వేతనం ఇస్తూ ఇతర పనుల్లో వెసలుబాటు కల్పించాలి.

– వంశీకృష్ణ, కార్యదర్శుల ఫోరం జిల్లా సెక్రటరీ

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

**కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**భద్రాచలంటౌన్:** చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్, ఎంఈఓ టి.రమ, సుధీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వైద్య సిబ్బందికి ప్రశంసలు..**



ఇల్లెందు ఆస్పత్రి సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

**ఇల్లెందు:** ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది సేవలను కలెక్టర్ పాటిల్ అభినందించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మారి రెండేళ్లు కావస్తున్న సందర్భంగా మంగళవారం డాక్టర్లు, సిబ్బందిని తన చాంబర్‌కు ఆహ్వానించారు. ప్రసూతి సేవలు, ఆర్థో, ఈఎన్టీ, జనరల్ సర్జరీ, డయాలసిస్, ల్యాబ్, పోస్టుమార్టమ్, 24 గంటల అత్యవసర చికిత్స విభాగం ప్రగతి నివేదికను చూసిన కలెక్టర్ డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబుతో పాటు సిబ్బందిని అభినందించారు. ఇదే ఒరవడి కొనసాగించాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధికి రూ.62 లక్షలు కేటాయించామని, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జి. హర్షవర్ధన్, డాక్టర్లు రాంనివాస్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు క్రీడా కిట్లు అందిస్తున్న పీఓ రాహుల్

**గుండాల :** మారుమూల ప్రాంతాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆకాంక్షించారు. ఆళ్లపల్లి మండలం మర్కోడు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఇటీవల రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొనగా వారి ప్రతిభను గుర్తించి అభినందించారు. పాఠశాలకు హాకీ, వాలీబాల్ కిట్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏజెన్సీ విద్యార్థులకు అన్ని రకాల క్రీడల్లోనూ నైపుణ్యం ఉంటుందని, వారిని ప్రోత్సహించి ముందుకు నడిపించాలని సూచించారు. ఐటీడీఏ నుంచి అన్ని విధాల సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి విద్యార్థులపై దృష్టి సారించి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. ఆయన వెంట డీడీ మణెమ్మ, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, ఏటీడీఓ రాధమ్మ తదితరులు ఉన్నారు.

## రక్షణతోనే అధిక ఉత్పత్తి సాధ్యం



బహుమతి అందుకుంటున్న కార్మికులు, అధికారులు

**మణుగూరు టౌన్:** పూర్తి స్థాయి రక్షణతోనే అధిక బొగ్గు ఉత్పత్తి సాధ్యమని ఎక్స్‌ప్లోజివ్స్ జీఎం బైద్య అన్నారు. రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మణుగూరులో రక్షణ తనిఖీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పీకేఓసీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బైద్య మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పూర్తిస్థాయిలో రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. ఇన్‌చార్జ్ జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో రక్షణ చర్యల విషయంలో పలు సంస్కరణలు చేపట్టిన జీఎం బైద్య సేవలు ప్రశంసనీయమన్నారు. గతేడాది పీకేఓసీ సాధించిన బహుమతులను రక్షణ తనిఖీ బృందం అధికారుల చేతులమీదుగా పీకేఓసీ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు అందుకున్నారు. అనంతరం సామగ్రి తరలింపు, ప్యాకింగ్, బ్లాస్టింగ్ తదితర అంశాలపై చేపట్టిన ప్రదర్శన ఆలోచింపజేసింది. కార్యక్రమంలో బృందం సభ్యులు షేక్ మిన్హాజుద్దీన్, వీరన్న, దయాకర్, సురేశ్, ప్రసాద్, మురళీకృష్ణ, శ్యాంప్రసాద్, యుగంధర్, శ్రీనివాస్, సేఫ్టీ అధికారి వెంకటరామారావు, దండమూడి రాంబాబు, వీరభద్రుడు, సురేశ్‌కుమార్, గుర్తింపు సంఘం నాయకులు వై.రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం నాయకులు వత్సవాయి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బ్యాంబో క్లస్టర్‌కు నిధులు మంజూరు


చెక్కు అందిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు శివారులో ఉన్న బ్యాంబోక్లస్టర్‌కు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ రూ.47 లక్షల చెక్కును క్లస్టర్ బాధ్యులకు మంగళవారం కార్యాలయంలో అందించారు. క్లస్టర్‌పై ప్రత్యేక చొరవచూపుతున్న కలెక్టర్.. తాజాగా నిధులు కేటాయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంజీవరావు, క్లస్టర్ డైరెక్టర్లు బొర్రా సురేశ్, మల్లం కృష్ణయ్య, కారం అన్వేశ్, పద్దం భద్రయ్య పాల్గొన్నారు.

### ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి


సమీక్షిస్తున్న జీఎం శ్రీనివాసరావు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 23వ తేదీన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో సింగరేణి ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరి శ్రీనివాసరావు వివిధ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. సింగరేణి సీఎండీ ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జి.రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, చంద్రమౌళి, శ్రీనివాస్, అజయ్‌కుమార్, మురళీధర్‌రావు, సోమయాజులు, రామశేషయ్య, నాగరాజు, జాకీర్‌హుస్సేన్, మాలకొండయ్య పాల్గొన్నారు.

### మెడికల్ బోర్డుకు 160 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో మంగళవారం జరిగిన ప్రీ మెడికల్ బోర్డుకు 193 మందికిగాను 160 మంది హాజరయ్యారు. వారికి బోర్డు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 10న జరిగే కార్యక్రమంలో పరీక్షల ఫలితాల ఆధారంగా అన్‌ఫిట్ చేస్తారు.

### 15న జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 15వ తేదీన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని బాక్సింగ్ అసోసియేషన్ కోచ్ సత్యబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బాక్సింగ్ సమాఖ్య సబ్ జూనియర్ బాల బాలికల పోటీలు హైదరాబాద్‌లో 20, 21 తేదీల్లో జరుగుతాయని, వీటితో పాటుగా అంతర్‌జిల్లా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు 22, 23వ తేదీల్లో జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల కోసం కొత్తగూడెంలో జరిగే ఎంపికకు బాలబాలికలు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 92999 03203 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### 26 నుంచి నెహ్రూ కప్ క్రికెట్ టోర్నీ

భద్రాచలంటౌన్: భద్రాచలం వేదికగా మూడు దశాబ్దాలుగా ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీని ఈ నెల 26 నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోట మళ్ల బాలయోగి, వాతాడి దుర్గాఅశోక్ తెలిపారు. టోర్నీలో విజేతకు రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచే జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీలు ఇవ్వడమే కాక ఇతర విభాగాల్లోనూ అవార్డులు ఇస్తామని వెల్లడించారు. జట్ల నమోదు కోసం 94401 01108 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

### ధ్రువపత్రాలు కలిగి ఉండాలి


వాహనాల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాజ్‌కుమార్

పినపాక: ప్రతి ఒక్క వాహనదారుడు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, లేనిపక్షంలో కేసు నమోదు చేసి వాహనాలు జప్తు చేస్తామని ఎస్‌ఐ రాజకుమార్ హెచ్చరించారు. మంగళవారం ఈ–బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆటోడ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ప్రయాణికుల పట్ల జాగ్రత్త వహించాలని, అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.20,413 |

# ఇక దూసుకుపోవడమే..

- ఇల్లెందులో రెండు ప్రధాన రోడ్లు పూర్తయితే కొత్త కళ
- ఇప్పటికే డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పూర్తి
- బీటీ కూడా వేస్తే అందుబాటులోకి విశాలమైన రహదారి


పూర్తిస్థాయిలో బీటీ వేయాల్సిన గుండాల రోడ్డు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో రెండు ప్రధాన రోడ్ల నిర్మాణం పూర్తయితే పట్టణానికి కొత్త కళ సంతరించుకోనుంది. ఓ రోడ్డు మూడొంతులు పూర్తి కాగా మరో రోడ్డు పనులు ప్రారంభంలోనే ఉన్నాయి. పట్టణంలోని గోవింద్‌సెంటర్ నుంచి గుండాల వైపు పెద్దమ్మ తల్లి చెరువు కట్ట వైపునకు ఒకటి కాగా, మరొకటి మున్సిపల్ కార్యాలయం ముందు నుంచి సత్యనారాయణపురం వైపునకు చేపడుతున్నారు. ఈ రెండు రోడ్ల విస్తరణ పూర్తయితే పట్టణానికి నూతన శోభ రావడం ఖాయమని చెబుతున్నారు. ఇంకో నెలరోజుల్లో మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం పూర్తికానుండగా ఆలోగా రహదారులు సిద్ధం చేయాలనే పట్టుదలతో ప్రత్యేక దృష్టి సారించారు.

**కీలకంగా గోవింద్ సెంటర్**

ఇల్లెందులో గోవింద్ సెంటర్ కీలకంగా మారుతోంది. ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఈ సెంటర్‌లోనే ఉన్నాయి. కోర్టు, ఫారెస్టు డివిజన్, తహసీల్దార్, డీఎస్పీ, ఐకేపీ కార్యాలయాలే కాక మైనార్టీ స్కూల్, కాలేజ్, ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, ఎంపీడీఓ, మున్సిపాలిటీ ఆఫీస్ ఇక్కడే ఉన్నాయి. ఇవే కాక పీఆర్ సబ్ డివిజన్, ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్, జీసీసీ, పీఏసీఎస్ కార్యాలయం, సత్యనారాయణపురం దర్గా, సంక్షేమ శాఖల హాస్టళ్లు, లేక్ వ్యూ పార్క్ ఇలా గోవింద్ సెంటర్ చుట్టూ విస్తరించి ఉన్నాయి. అంతేకాక ఇదే సెంటర్‌లో ఫౌంటెన్ ఏర్పాటు చేయడంతో కీలక జంక్షన్‌గా రూపుదిద్దుకుంది.

**బీటీ కూడా వేస్తే..**

పట్టణంలోని గోవింద్ సెంటర్ నుంచి చెరువు కట్ట (పాఖాల రోడ్డు) వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు రూ.2 కోట్లతో పూర్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఐదున్నర మీటర్ల వెడల్పుతో 730 మీటర్ల పొడవు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రూ.కోటితో గోవింద్ సెంటర్ నుంచి సత్యనారాయణపురం వెళ్లే రహదారిలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, సత్యనారాయణపురం రోడ్డులో విద్యుత్ స్తంభాలు తొలగిస్తే బీటీ రోడ్డు పూర్తవుతుంది.

**రద్దీ వేళ ఇక్కట్లకు చెక్**

రెండేళ్లకోసారి ములుగు జిల్లాలో జరిగే మేడారం జాతరకు ఇల్లెందు – గుండాల రోడ్డులో వేలాదిగా వాహనాల రాకపోకలు ఉంటాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మేడారం వెళ్లే భక్తులకు ఇదే ప్రధాన రహదారిగా మారింది. అంతేకాక నిత్యం వందలాది వాహనాల రాకపోకల వల్ల ఇల్లెందు గోవింద్ సెంటర్ మరింత రద్దీగా మారుతోంది. ఈ తరుణాన డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే వాహనదారుల ఇక్కట్లు తీరనున్నాయి. ఇక ఏటా సత్యనారాయణపురం దర్గాలో జరిగే ఉర్సు సమయాన వచ్చే భక్తులకు కూడా సౌకర్యంగా ఉంటుంది.

**తుది దశకు పనులు**



రహదారిపై బీటీ పనులు త్వరలో పూర్తి చేయనున్నాం. మిగతా అన్ని పనులు పూర్తిచేశాం. రోడ్డును మధ్యలో డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు జరిగింది. సత్యనారాయణపురం రోడ్డులోనూ విద్యుత్ స్తంభాలు తొలగించి డివైడర్లు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తాం.

–గాజే రాజు, పీఆర్ ఏఈ, ఇల్లెందు

## గురుకులం ఎదుట మహిళ నిరసన


నిరసన తెలుపుతున్న ఉష

పాల్వంచరూరల్: గురుకుల బాలికల పాఠశాలలో కొద్దిరోజులు వాచ్‌ఉమెన్‌గా పనిచేసిన మహిళ మంగళవారం నిరసన చేపట్టింది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (భద్రాచలం)లో ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లలో వాచ్‌ఉమెన్‌గా విధులు నిర్వర్తించిన జినుగు ఉష.. పోస్టును ఔట్‌సోర్సింగ్‌లోకి మార్చి క్రమబద్ధీకరించాలని కోరింది. తాను పనిచేసిన పోస్టులో తనకే అవకాశం ఇవ్వాలని, తనను తీసుకోకుండా ప్రిన్సిపాల్ డబ్బులకు ఆశపడి పాఠశాలలోని అటెండర్ భార్య నాగజ్యోతికి ఇవ్వాలనే ఉద్దేశంతో తనను తొలగించారని ఆరోపించింది.

**ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..**

గురుకుల పాఠశాలలో వాచ్‌ఉమెన్ పోస్టు ఖాళీ లేదు. అయినా కొద్దిరోజులు స్కూల్ గేటు వద్ద వాచ్‌మెన్ రాకపోవడంతో ఉషను తాత్కాలికంగా నియమించాం. అది కూడా పూర్తిస్థాయిలో ఆమె పనిచేయలేదు. ఆ పోస్టుకు పదో తరగతి అర్హత కలిగిన వారికి అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉషను విధుల్లోకి తీసుకోలేదు.

– స్వరూపారాణి, పాఠశాల ప్రిన్సిపాల్

## జైలు వార్డెన్‌గా భద్రాచలం వాసి..


సాంబశివరావు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం జగదీష్‌కాలనీకి చెందిన కొరకాసుల సాంబశివరావు స్థానిక జైలు వార్డెన్‌గా మంగళవారం ఎంపికయ్యాడు. 2022 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో అర్హత సాధించిన సాంబశివరావు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ (ఎస్‌ఐసీఏ)లో శిక్షణ పొంది ప్రిసన్ టెక్నాలజీలో బంగారు పతకం సాధించాడు. ఈ నెల 12న సాంబశివరావు భద్రాచలం జైలు వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. పలువురు ఆయన్ను అభినందించారు.

## ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి


వైరా : తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

వైరా/బోనకల్: బ్యాంకుల్లో అప్పు ఉన్న ప్రతీ రైతుకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైరా తహసీల్ ఎదుట మంగళవారం రైతులతో కలిసి ధర్నా చేయగా తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులందరి రుణాలు మాఫీ చేయాలన్నారు. జిల్లాలో ఇంకా లక్ష మంది రైతులకు మాఫీ కాకుండా వంద శాతం పూర్తయిందని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. అలాగే, రుణమాఫీ చేయాలని కోరుతూ రైతులు సీఎంకు రాసిన పోస్ట్‌కార్డులను బోనకల్ నుంచి పంపించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, మేడా శరాబందీ, కిలారు శ్రీనివాసరావు, బాణాల శ్రీనివాసరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, మల్లికార్జున్, వాసిరెడ్డి నర్సింహారావు, తుళ్లూరి రమేష్, దొండపాటి నాగేశ్వరావు, గుమ్మా ముత్తారావు, కిలారు సురేష్ పాల్గొన్నారు. ఆతర్వాత రైతు సంఘం నాయకులు బోనకల్ మండలం తూటికుంట్లలో పర్యటించి కల్తీ విత్తనాలతో దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలించారు. అధికారులు స్పందించి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఇసుక తరలిస్తున్న ఐదు వాహనాల పట్టివేత

పాల్వంచరూరల్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు వాహనాలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మొర్రేడు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక లారీని మంగళవారం ఆర్‌ఐలు రవికుమార్‌రెడ్డి, హచ్యా దమ్మపేట సెంటర్‌లో పట్టుకుని సీజ్ చేశారు.

**ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలో మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. అనిశెట్టిపల్లి వద్ద వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సెంట్రల్ పార్క్‌కి తరలించామని, కేసు నమోదు చేశామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హతిరాం తెలిపారు.

## అక్రమ కట్టడం కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన షాపును మంగళవారం ఆర్టీసీ అధికారులు కూల్చివేశారు. డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ ఆదేశాల మేరకు ఆర్టీసీ సివిల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది అక్రమంగా ఏర్పాటు చేసిన రూమ్‌ను తొలగించారు. ఆర్టీసీ స్థలాలను, షాపులను ఎవరైనా ఆక్రమిస్తే చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎం దేవేందర్‌గౌడ్ హెచ్చరించారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

పాల్వంచరూరల్: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం సూరారం అటవీ ప్రాంతంలో పోలీసులు గుర్తించారు. మండలంలోని సూరారం సమీపంలోని అటవీ ప్రాంతంలో 60 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తి మృతదేహన్ని మంగళవారం గుర్తించారు. మృతుడు తెల్లటి పంచె, బనియన్ ధరించి ఉన్నాడని, రెండు రోజుల కిందట మృతి చెంది ఉంటాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## పంట ఫలితం చూడకుండానే కన్నుమూత

- ధాన్యం తీసుకొచ్చిన ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తాకడంతో షాక్
- అక్కడికక్కడే మృతి చెందిన అన్నదాత


దొడ్డ శ్రీను (ఫైల్)


శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

చింతకాని: ఆరుగాలం కష్టపడి పండించిన వరి కోతలు పూర్తయ్యాయి.. కల్లెంలో ఆరబెట్టి తేమ తగ్గగానే అమ్మాలని ఆ రైతు ఆశించాడు.. ఈమేరకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి కల్లెంలో పోస్తుండగా ట్రాలీకి విద్యుత్ తీగలు తాకడంతో షాక్‌కు గురైన ఆ అన్నదాత కన్నుమూసిన ఘటన చింతకాని మండలం నర్సింహాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దొడ్డ శ్రీను(52) తన సోదరుడు రమణయ్య కలిసి కౌలుకు చేస్తున్న వరి పంటను మంగళవారం ఉదయం హార్వెస్టర్‌తో నూర్పిడి చేయించారు. అనంతరం ధాన్యాన్ని రమణయ్య ట్రాక్టర్‌లో గ్రామసమీపాన కల్లంలో ఆరబెట్టేందుకు తీసుకొచ్చారు. అయితే, అక్కడ 11 కేవీ విద్యుత్ వైర్లు కిందకు ఉండడాన్ని గమనించని రమణయ్య హైడ్రాలిక్ ద్వారా లేపడంతో ట్రక్కుకు వైర్లు తాకి విద్యుత్ సరఫరా అయింది. అప్పటికే ట్రక్కును పట్టుకున్న శ్రీను విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సీట్లో కూర్చున్న రమణయ్య తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కాగా, విద్యుత్ సరఫరా కావడంతో ట్రాక్టర్ టైర్లు కూడా పేలిపోగా సమీప రైతులు ఆందోళనకు గురయ్యారు. మృతుడు శ్రీను 15 ఎకరాల మొక్కజొన్న, ఐదెకరాల్లో వరి సాగు చేయగా, ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నాగుల్‌మీరా పరిశీలించి వివరాలను సేకరించారు. అయితే, 11కేవీ విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ చేతికి అందే ఎత్తులో ఉన్నాయని పలుమార్లు రైతులు, గ్రామస్తులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు శ్రీను ప్రాణాలు కోల్పోయాడని బంధువులు ఆరోపిస్తున్నారు.

**వరుసగా ప్రమాదాలు**

మండలంలో వరుసగా విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నెల క్రితం లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు గూని ప్రసాద్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందగా సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. అలాగే నర్సింహాపురానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జల్లి రాము విద్యుత్ వైర్లను సరిచేసే క్రమాన ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ఇలా వరుస ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## మహిళ మెడలో గొలుసు చోరీ

చుంచుపల్లి: మహిళ మెడలో గొలుసు చోరీచేసిన ఘటన మండలంలోని బాబూ క్యాంపులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబూక్యాంప్‌లో నివాసముండే పద్మ నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్

దమ్మపేట: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలోని పార్కలగండిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రగుంపు గ్రామానికి చెందిన తాటి సాయికృష్ణ, బైట ఆనంద్, చిల్లగుంపు గ్రామానికి చెందిన కుంజా కిశోర్ పార్కలగండి శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు కింద కూర్చొని గంజాయి తాగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.24 వేల విలువైన 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏపీ నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు యువకులు అంగీకరించగా ఈ కేసులో మరో ఆరుగురిని పట్టుకోవాల్సి ఉందని ఎస్‌ఐ వివరించారు. కానిస్టేబుళ్లు వీర, లక్ష్మణ్ ఉన్నారు. కేసు నమోదు చేశామని సీఐ కరుణాకర్ వెల్లడించారు.

## గంజాయి విక్రయిస్తున్న యువకులు...

పాల్వంచ: గంజాయి విక్రయిస్తున్న యువకులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వనమాకాలనీ సమాధుల ఏరియాలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ సుమన్ దాడి చేసి, జాన్ పీటర్, దామర్ల ఉదయ్‌ను పట్టుకున్నారు. జెట్టి ప్రణయ్‌కుమార్ పరారయ్యాడు. ప్రశాంత్ (బాబీ) అనే వ్యక్తికి కూడా ఇందులో హస్తం ఉన్నట్లు తేలింది. పట్టుకున్న ఇద్దరి నుంచి 480 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దామిని దాస్ నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## చిరకాల స్వప్నం.. విమానాశ్రయం


కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన విమానాశ్రయ నిర్మాణం ఏళ్లుగా ప్రతిపాదనల దశలో నిలిచి పోతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, నాయకులు తాండ్ర వినోద్‌రావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మధ్యకాలంలో కొత్తగూడెం రామవరంలో విమానాశ్రయం కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను చేపట్టినట్లు తెలిసిందని, ఇది కూడా గతంలో మాదిరిగా పలు కారణాలు చూపెడుతూ ఆమోదం పొందకపోతే ప్రజలు మరోసారి నిరాశకు గురవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదం పొందడానికి వీలుంటుందని చెప్పారు. గతంలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని విమానాశ్రయానికి ఏకైక స్థలమే కాకుండా మరికొన్ని చోట్ల అనువైన స్థలాలను గుర్తించి కేంద్ర విమానాయాన సంస్థకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమావేశంలో జీవీకే మనోహర్, కుంజా ధర్మారావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నరేంద్రబాబు, పానిశెట్టి వెంకటేశ్వర్లు, సోమసుందర్, కొదమసింహం పాండురంగాచార్యులు, సొప్పరి క్రాంతి, ముస్కు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకుల బృందం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

**డీవైఎస్‌ఓ వరంధామరెడ్డి**


మాట్లాడుతున్న డీవైఎస్‌ఓ పరాంధామరెడ్డి

బూర్గంపాడు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి అన్నారు. బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలకు తగు సమయం కేటాయించాలని సూచించారు. 29 విభాగాలలో ఈ క్రీడలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపీడీఓ జమలారెడ్డి, ఎస్‌ఐ నాగబిక్షం కాసేపు ఆటలు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ యదుసింహారాజు, అధ్యాపకుడు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బర్ల ప్రభాకర్, మహేష్, భూక్యా వెంకటేశ్, ప్రధానోపాధ్యాయురాలు రవీలా, విద్యాసాగర్, వేణుగోపాల్, హరికృష్ణ, వెంకటనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ యూనిట్లపై నిర్లక్ష్యం తగదు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారిగూడెం, పెదవాగు ప్రాజెక్టు, అశ్వారావుపేటలో మంగళవారం భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ పర్యటించారు. ఐటీడీఏ ద్వారా బచ్చువారిగూడెం మత్స్యకార సొసైటీకి యూనిట్ మంజూరు కాగా, ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు ఫిర్యాదు అందడంతో విచారణ చేశారు. అనంతరం అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని 43 గిరిజన మండలాల్లో 275 యూనిట్లకు గాను రూ.2.62 కోట్లు మంజూరు కాగా, యూనిట్ల ఏర్పాటులో జాప్యం జరుగుతోందన్నారు. ఈ యూనిట్లను ఈ నెల 16వ తేదీనాటికి గ్రౌండింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ, బ్యాంకర్లను ఆదేశించినట్లు తెలిపారు. యూనిట్ల ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 90 శాతం రాయితీతో సోలార్ యూనిట్లు మంజూరు చేస్తున్నామని, 10 శాతం లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సోలార్ యూనిట్ ఏర్పాటుకు లబ్ధిదారులకు నాలుగు ఎకరాల పట్టాభూమి ఉండాలని, విద్యుత్ సబ్ స్టేషన్‌కు రెండు కిలో మీటర్ల పరిధిలో ఉంటే మంజూరు చేస్తామని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, రామచంద్రరావు ఉన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె షురూ..


సమ్మె చేస్తున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన నిరసన దీక్షలు సోమవారంతో ముగిశాయి. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. సమ్మెలో కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది, యూఆర్‌ఎస్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, కాంప్లెక్స్ రీసోర్స్ పర్సన్లు, మెసెంజర్లు పాల్గొనడంతో బోధన ఆగిపోయింది. రానున్న రెండు మూడు నెలల్లో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ఉన్నా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమని జిల్లా అధ్యక్షుడు భూక్య మోహన్ విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పి.సిద్ధయ్య, ముఖ్య సలహాదారులు వనమా సురేశ్, సేవ్యా, అర్జున్, పార్వతి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు సంతు, కవిత, పద్మజ, సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు


మాట్లాడుతున్న డీపీఓ చంద్రమౌళి

చుంచుపల్లి: త్వరలో జరగనున్న గ్రామపంచాయతీల ఎన్నికలకు జిల్లాలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి తెలిపారు. మంగళవారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రచురణ, ఎన్నికల నియమావళిపై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో ఐడీఓసీలో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఓ విద్యాచందన, జెడ్పీసీఈఓ నాగలక్ష్మి హాజరయ్యారు. డీపీఓ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు జిల్లాలో చేపట్టబోతున్న ఏర్పాట్లను ఆయన వివరించారు. గ్రామాల పరిధిలో ఓటర్ల జాబితాల ఆధారంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా షెడ్యూల్ ప్రకారం ప్రకటించనున్నట్లు చెప్పారు. మండల స్థాయిలో సంబంధిత ఎంపీడీఓల ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ నెల 12న సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రకటించిన పోలింగ్ స్టేషన్లలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే 12 వరకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల తుది జాబితా ఈ నెల 17న ప్రచురిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని 479 గ్రామపంచాయతీలు, 4,232వార్డుల్లో ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలకు అందుబాటులో పోలింగ్ స్టేషన్లను ఉంచుతామని, రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించి త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సహకరించాలని కోరారు. సమావేశంలో పలు పార్టీల నాయకులు సలిగంటి శ్రీనివాస్, గొని నాగేశ్వరరావు, సంకుబాపన అనుదీప్, అన్నవరపు సత్యనారాయణ, జి.మల్లికార్జున్‌రావు, నోముల రమేశ, లక్ష్మణ్ అగర్వాల్ హాజరయ్యారు.

## క్లుప్తంగా...

### 17 నుంచి శ్రీవారికి తిరుప్పావై

16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం

**తిరుమల:** తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16న ప్రారంభం కానుంది. ఆరోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబరు 17 నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. జనవరి 14తో ధనుర్మాస ఘడియలు ముగియనున్నాయి. ఈసందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారు.

### రద్దీ రోజుల్లోనూ మల్లన్న స్పర్శ దర్శనం

**శ్రీశైలం టెంపుల్:** రద్దీ రోజుల్లోనూ శ్రీశైల మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలువురు భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో, ప్రభుత్వ సెలవు దినాలు తదితర రద్దీ రోజుల్లోనూ నిర్దిష్ట వేళల్లో మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మల్లన్న స్పర్శదర్శనం ఉంటుందన్నారు. గతంలో మాదిరిగానే స్పర్శ దర్శనం టికెట్లను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పొందాల్సి ఉంటుందన్నారు.

### డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డి



సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన అదే విభాగం జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జి.వైజయంతి గత నెల 30న పదవీ విరమణ చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

# 'సానా'కు శానా చేస్తున్నారు..

## రాజ్యసభ అవకాశం ఇవ్వడంపై టీడీపీలో తీవ్ర విమర్శలు

- ఒత్తిళ్లకు సీఎం చంద్రబాబు లొంగిపోయారని నేతల ఆగ్రహం
- సీబీఐ, ఈడీ కేసులున్న వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ఆందోళన
- కొత్త నేతను అందలం ఎక్కిస్తే తమ పరిస్థితి ఏమిటని సీనియర్ల నిలదీత
- ఎవరెన్ని చెప్పినా అలాంటి నేతలే అవసరమని సీఎం స్పష్టీకరణ



**సాక్షి, అమరావతి :** మనీ లాండరింగ్, హవాలా కేసులు సహా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర ఉన్న సానా సతీష్‌కు సీఎం చంద్రబాబు రాజ్యసభ సీటు ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. లాబీయింగ్, అవినీతి వ్యవహారాలతో అంటకాగే వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం సరికాదంటూ టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో, వ్యక్తిగత సంభాషణల్లో విరుచుకుపడుతున్నారు. పార్టీ కోసం సుదీర్ఘ కాలం నుంచి పని చేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా పార్టీలోకి వచ్చి పెత్తనం చెలాయిస్తున్న సానా సతీష్‌కు ఉన్నత పదవి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆయనకు పదవి ఇస్తున్నారని కొన్ని రోజుల క్రితమే తెలియడంతో చాలా మంది ముఖ్య నేతలు చంద్రబాబును కలిసి తమ అసంతృప్తి వెలిబుచ్చారు. ఎంతో మంది సీనియర్లు ఉండగా, తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని పరిగణనలోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే తమ లాంటి సీనియర్ల పరిస్థితి ఏమిటని.. క్యాడర్‌కు, నాయకులకు ఏం సమాధానం చెప్పాలని అడిగినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో, అంతకు ముందు.. పార్టీకి భారీగా నిధులు ఇచ్చిన వారికి ఇప్పుడు న్యాయం చేయక తప్పదని ఆయన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. లోకేశ్ పాదయాత్రలో సతీష్ లాంటి నేతలు చాలా ఉపయోగపడ్డారని, వారు డబ్బు ఖర్చు చేశారు కాబట్టే అధికారంలోకి వచ్చాక ప్రతిఫలం ఇస్తున్నామని స్పష్టం చేసినట్లు.. అంతటితో ఆగకుండా పార్టీలో కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు స్పందించిన తీరుతో సీనియర్ నాయకుల్లో ఇంకా ఆగ్రహం పెరిగిపోయింది. పార్టీ చంద్రబాబు చేతుల్లో లేదని, లోకేశ్ కోటరీ చేతుల్లో ఉందని చర్చించుకుంటున్నారు. లోకేశ్ కోటరీలో అత్యంత కీలకంగా ఉంటూ బదిలీలు, కాంట్రాక్టులు సహా అన్ని వ్యవహారాలను సానా సతీష్ చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో ఆయన పేరును రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు ప్రకటించక తప్పలేదంటున్నారు.

### విస్తుగొలిపే తీవ్ర ఆరోపణలు

- సానా సతీష్‌పై మనీ లాండరింగ్ అభియోగాలుండడంతో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ కేసులకు సంబంధించి 2019 జూలైలో ఆయన్ను ఈడీ అరెస్టు చేసి జైలుకు పంపింది.
- మనీ లాండరింగ్, హవాలా కేసుల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మీట్ వ్యాపారి మొయిన్ ఖురేషీతో సతీష్‌కు సన్నిహిత సంబంధాలున్నట్లు తేలింది. ఖురేషీతో కలిసి అక్రమ వ్యాపారాలు కూడా చేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే తనపై ఉన్న మనీ లాండరింగ్ కేసుల నుంచి తప్పించుకునేందు ఖురేషీ ద్వారా సీబీఐ అధికారులకు సతీష్ లంచం ఇచ్చినట్లు స్పష్టమైంది.
- అదే సమయంలో సీబీఐ డైరెక్టర్‌గా పని చేసిన రాకేష్ ఆస్థానా, మరో సీబీఐ అధికారి అలోక్ వర్మ మధ్య చిచ్చుపెట్టి.. ఏకంగా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర సతీష్‌ది. తనను కేసు నుంచి తప్పించేందుకు సీబీఐ డిప్యూటీ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాకు రూ.2 కోట్లు లంచం ఇచ్చినట్లు స్పష్టమవడంతో ఈడీ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు.
- తనపై ఉన్న ఆరోపణలను కొట్టేయాలంటూ ఈ ఏడాది జులైలో సానా సతీష్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా దాన్ని కోర్టు కొట్టివేసింది. ఇలా తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని విచారించాల్సిందేనని స్పష్టం చేసింది.

### సబ్ ఇంజినీర్ నుంచి కోట్లకు పడగలెత్తి..

- కాకినాడకు చెందిన సానా సతీష్ మొదట్లో విద్యుత్ శాఖలో సబ్ ఇంజినీర్‌గా పని చేశారు. ఉద్యోగం వదిలేశాక అక్రమ వ్యాపారాలతో కోట్లు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే మనీ లాండరింగ్, హవాలా కేసులు నమోదయ్యాయి. అలాంటి వ్యక్తి చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు.
- అక్రమంగా సంపాదించిన డబ్బును ఖర్చు చేసి వారికి బాగా దగ్గరయ్యారు. లోకేశ్ పాదయాత్ర ఖర్చును చాలా వరకు సతీష్ భరించినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీగా డబ్బు సమకూర్చినట్లు తెలిసింది. చాలా వ్యవహారాల్లో లోకేశ్ వెన్నంటే ఉండి అన్నీ సమకూర్చినట్లు చెబుతున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా అవతరించారు.
- మంత్రి పదవులు, ఉన్నతాధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు, కాంట్రాక్టులు ఇతర అనేక వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవి ఆయన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా కాకలు తీరిన సీనియర్ నేతలను కాదని రాజ్యసభ సీటునే తన్నుకుపోయారు.

# ప్రశ్నిస్తే పనిపడతా!

- బీసీ నేతల మధ్య చంద్రబాబు చిచ్చు
- కేవీ రావుకు వ్యతిరేకంగా యనమల లేఖాస్త్రం
- దీనిపై రెడ్డి సుబ్రహ్మణ్యం ఘాటు వ్యాఖ్యలు
- ఇదంతా సీఎం సూచనల మేరకే అంటున్న నేతలు
- యనమల టార్గెట్‌గా సోషల్ మీడియాలోనూ పోస్టులు

**సాక్షి, అమరావతి :** రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే చంద్రబాబు ఇప్పుడు పార్టీలోని ఇద్దరు బీసీ నేతల మధ్య చిచ్చు పెట్టారు. సుదీర్ఘ కాలం నుంచి తనకు బలమైన మద్దతుదారుగా ఉన్న సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలను జీర్ణించుకోలేక ప్రశ్నించడంతో ఆయనపైకి మరో సీనియర్ నేత, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంను ఉసిగొల్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా టీడీపీ సోషల్ మీడియా కూడా యనమలకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయి ఆరోపణలతో ట్రోల్ చేస్తోంది. దీనికంతటికీ కాకినాడ పోర్టు వ్యవహారంలో చంద్రబాబు వైఖరికి విరుద్ధంగా యనమల రామకృష్ణుడు ఆయనకు లేఖ రాయడమే కారణం. కాకినాడ పోర్టుకు చెందిన కేవీ రావు చౌదరికి చంద్రబాబు మద్దతు పలుకుతూ రాజకీయంగా ఆయన్ను పావులా వాడుకుంటున్నారు. కానీ యనమల మాత్రం తాను రాసిన లేఖలో కేవీ రావు చౌదరి కాకినాడ సెజ్ భూముల ద్వారా వేల కోట్ల లబ్ధి పొందారని.. బీసీ, మత్స్యకార రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తనను ధిక్కరిస్తూ లేఖ రాయడంతో చంద్రబాబు.. యనమలను ప్రశ్నించకుండా ఇతర బీసీ నేతలను ఆయనపైకి ప్రయోగించినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే రెడ్డి సుబ్రహ్మణ్యం బహిరంగంగా యనమల రామకృష్ణుడిపై ఆరోపణలు గుప్పించారు. 40 ఏళ్లగా యనమల బీసీల గురించి పట్టించుకోలేదని, ఇప్పుడు తనకు పదవి ఇవ్వలేదనే కారణంతో చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయనకు తోడుగా మరికొందరు కింది స్థాయి నేతలు కూడా యనమలపై విమర్శలు చేశారు. టీడీపీ సోషల్ మీడియా అయితే యనమల పార్టీలో ఉన్న విషయాన్ని కూడా మరచిపోయి ఆడేసుకుంటోంది.




### చంద్రబాబుకు తెలియకుండానే తిడతారా?

పార్టీలో తన స్థాయి ఉన్న ఒక సీనియర్ బీసీ నాయకుడిని, మరో సీనియర్ బీసీ నాయకుడు బహిరంగంగా తిట్టారంటే అందుకు చంద్రబాబు పరోక్ష అనుమతి కచ్చితంగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యనమలకు వ్యతిరేకంగా పార్టీలోనే ఇంత జరుగుతున్నా, చంద్రబాబు స్పందించక పోవడాన్ని బట్టి ఆయన అభిమతం ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు కొందరు బీసీ నేతలు యనమలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. చంద్రబాబుకు ఆది నుంచి తోడు, నీడగా ఉన్న నాయకుడిని ఇలా అవమానించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా పార్టీలోనే బీసీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకునే పరిస్థితి ఏర్పడినా, చంద్రబాబు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం టీడీపీలో జరుగుతున్న పరిణామాల పట్ల యనమల రామకృష్ణుడు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనలాంటి సీనియర్లను పూర్తిగా పక్కన పెట్టేయడంతో ఆయన ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీనికితోడు కాకినాడ పోర్టు, సెజ్ విషయంలో కేవీ రావు చౌదరికి అనుకూలంగా వ్యవహరించడం, రాజ్యసభ స్థానాలను లాబీయిస్టులకు కట్టబెడుతుండడంతో తట్టుకోలేక ఆయన తొలిసారిగా చంద్రబాబును ధిక్కరించి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడం నుంచి చంద్రబాబుతో కలిసి పని చేసిన యనమల లాంటి నాయకుడు తిరుగుబాటు స్వరం వినిపించడంతో పార్టీలో గందరగోళం నెలకొంది.

## అది విప్లవాత్మక ఆవిష్కరణ

గుండె వాల్వ్‌ల చికిత్సలో 'మైవాల్ ఆక్టోప్రో'పై కార్డియాలజిస్టులు

**సాక్షి, హైదరాబాద్:** 'మైవాల్ ఆక్టో ప్రో ట్రాన్స్ క్యాథెటర్ హార్ట్ వాల్వ్' అనే ఉపకరణం గుండె చికిత్సల్లో విప్లవాత్మక మార్పు తెస్తుందని కార్డియాలజిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ ఉపకరణాన్ని కనుగొనడం గుండె చికిత్సల్లో కీలక మైలురాయిగా అభివర్ణించారు. నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇటాలియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, పీసీఆర్ లండన్ వాల్వ్స్-2024 వంటి అంతర్జాతీయ వేదికలపై ఓ భారత కంపెనీ ఉపకరణాన్ని పలువురు కొనియాడటం భారతీయులకు ఎంతో గర్వకారణమని చెన్నైకు చెందిన డాక్టర్ అనంతరామన్, డాక్టర్ జాన్ జోస్, డాక్టర్ సెంగొట్టువేలు ప్రశంసించారు. గుండె చికిత్సల ఉపకరణాలను అభివృద్ధి చేస్తున్న 'మెరిల్ లైఫ్ సైన్సెస్' సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉపకరణం రూపుదిద్దుకుంది. ఈ ఉపకరణం ద్వారా గుండెను పూర్తిగా తెరవకుండానే చిన్న గాటుతో 'అయోర్టిక్ వాల్వ్'లో వచ్చే లోపాలకు చికిత్స అందించవచ్చని మెరిల్ లైఫ్ సైన్సెస్ ఓ ప్రకటనలో పేర్కొంది.

## 14న దుర్గమ్మ కలశజ్యోతి మహోత్సవం

**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు కలశజ్యోతి మహోత్సవం జరగనుంది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడ, సత్యనారాయణపురం శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి భవానీలు, అమ్మవారి భక్తులు జ్యోతులను పట్టుకుని ఇంద్రకీలాద్రికి వస్తారు. భవానీలు తమ కలశజ్యోతులను కనకదుర్గ నగర్‌లో సమర్పించడంతో పాటు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కలశ జ్యోతుల నేపథ్యంలో శనివారం రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు.

జిల్లా వార్తలు

### ఆర్థిక చేయూత అభినందనీయం



పీడీ తల్లికి చెక్కు అందిస్తున్న డీఈఓ శర్మ, పీఆర్‌టీయూ నాయకులు

**ఖమ్మం సహకారనగర్:** ముదిగొండ మండలం మేడేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా పీఆర్‌టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును శ్రీనివాస్ తల్లి వెంకమ్మకు డీఈఓ సోమశేఖరశర్మ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పీఆర్‌టీయూలో క్రియాశీల సభ్యత్వం పొందిన సభ్యులు ఏదైనా కారణంతో మృతి చెందితే రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, ఎంఈఓ శైలజాలక్ష్మి, నాయకులు కట్టా శేఖర్‌రావు, టి.ప్రసాద్, జి.వీరయ్యచౌదరి, గుడిపూడి శ్రీనివాసరావు, తాళ్లూరి చంద్రశేఖరరావు, ఫిజికల్ డైరెక్టర్లు కె.రాము, నాగుల్‌మీరా, కృష్ణయ్య పాల్గొన్నారు.

### 15న ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు

**ఖమ్మం స్పోర్ట్స్:** సబ్ జూనియర్ బాలబాలికల విభాగంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఆర్చరీ జట్టు ఎంపికకు ఈనెల 15న పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీలకు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు. ఇండియన్ రౌండ్, కాంపౌండ్ రౌండ్ అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వివరాలకు 93946 43139, 94945 43139 నంబర్లలో సంప్రదించాలని వెల్లడించారు.

### నర్సింగ్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం టేకులపల్లిలోని జిల్లా మహిళా ప్రాంగణంలో నర్సింగ్ శిక్షణ ఇచ్చేందుకు అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ వి.విజేత తెలిపారు. పబ్లిక్ హెల్త్ నర్స్ పోస్టుకు రెండేళ్ల అనుభవం కలిగి, ఎమ్మెస్సీ లేదా బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులని, రిటైర్డ్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 13వ తేదీలోగా మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు అందజేయాలని, ఇతర వివరాలకు 76600 22512 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# పంచాయతీల్లో పనులు సాగేదెలా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరులో కొనసాగుతున్న జాప్యంతో గ్రామ పంచాయతీల కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ పరిణామం పంచాయతీల అభివృద్ధిపైనా ప్రభావం చూపిస్తోంది. దీంతో ప్రభుత్వమే నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనం జమ చేసేందుకు సన్నద్ధమైంది. అందుకు అనుగుణంగా వివరాలు ఆన్‌లైన్ చేయడంతో కార్మికులు సంబురపడినా.. నిబంధనల మేరకు కొందరిని తగ్గిస్తుండటంతో ఆందోళన నెలకొంది. – ఇల్లెందురూరల్

### ఆన్‌లైన్ వేతనం చెల్లింపు ప్రక్రియలో గందరగోళం

- పంచాయతీల్లో ఎంపీడబ్ల్యూల కుదింపునకు సిద్ధం
- ఇప్పటికే గ్రీన్ అంబాసిడర్లు, డంప్‌షెడ్డు వర్కర్ల తొలగింపు
- ఆందోళనకు సిద్ధమవుతున్న కార్మిక సంఘాలు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు



విధుల నుంచి తొలగించారని వాపోతున్న గ్రీన్ అంబాసిడర్లు

**ఆరేళ్ల కిందట నియామకం**

ప్రజల వద్దకు పరిపాలన చేర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 2018లో భౌగోళిక స్వరూపం, జనాభా ప్రాతిపదికన కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే ఇల్లెందు మండలంలో జీపీల సంఖ్య 29కి చేరింది. 2019 జనవరిలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్ (ఎంపీడబ్ల్యూ) పేరిట కార్మికులను నియమించారు. ప్రారంభంలో జీఓ 51కి అనుగుణంగా ప్రతీ 500 జనాభాకు ఒక కార్మికుడు ఉండాలన్న నిబంధన ఉండగా.. ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్ సమకూర్చడంతో చెత్త సేకరణ, తరలింపు కోసం అదనపు కార్మికుల అవసరం ఏర్పడింది. ఈ మేరకు అప్పటి ప్రజాప్రతినిధులు నిబంధనలను పక్కన పెట్టి అదనంగా ఇద్దరు, ముగ్గురు కార్మికులను నియమించుకున్నారు. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సకాలంలో విడుదల కావడంతో వేతనాలు చెల్లించారు.

**ఇప్పుడు ఎదురుచూపులు**

సుమారు ఏడాదిగా జీపీలకు పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరులో జాప్యం జరుగుతోంది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు నెలల తరబడి వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం గ్రామపంచాయతీల ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ ఇతరత్రా పనులకు సర్దుబాటు చేస్తున్నారు. కార్మికుల వేతనం విషయంలో నిబంధనల పేరిట జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**గ్రీన్ అంబాసిడర్ల తొలగింపు**

గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం మొక్కల ఆలనపాలన చూసేందుకు నెలకు రూ.5 వేల వేతనంతో కార్మికులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 2021లో నియమించింది. గతేడాది ఏప్రిల్ నుంచి పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అప్పటి వరకు పనిచేసిన గ్రీన్ అంబాసిడర్లనే కొనసాగిస్తూ అధికారులు పంచాయతీ ద్వారా వేతనాలు చెల్లించారు. ఇంతేకాకుండా డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేపట్టేందుకు ప్రత్యేకంగా కార్మికులను నియమించింది. వీరికి కూడా పంచాయతీ ద్వారా వేతనాలు చెల్లించారు. కానీ, తాజాగా వీరిని పంచాయతీ అధికారులు విధుల నుంచి తొలగించారు.

### జాబితాలో పేర్లు ఏవీ?

గ్రామపంచాయతీల కార్మికులకు నేరుగా ఆన్‌లైన్ ద్వారా వేతనాలు చెల్లించాలని నిర్ణయించిన ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ల వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించింది. దీంతో నెలనెలా వేతనాలు వస్తాయని కార్మికులు ఆశించారు. కానీ, జీఓ 51 ప్రకారం ప్రతీ 500 జనాభాకు ఒకే కార్మికుడిని నియమించాలనే నిబంధన ఉన్నా గతంలో అదనంగా కార్మికులను నియమించారు. ఇప్పుడు ఆన్‌లైన్ ప్రక్రియలో కొందరి పేర్లు గల్లంతవడంతో కార్మికుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఇప్పటికిప్పుడు విధుల నుంచి తొలగించే ప్రయత్నం చేయకున్నా ఎప్పటికైనా చేస్తారని.. తద్వారా తమ ఉపాధి మాటేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

### సిబ్బంది తొలగింపు అన్యాయం



గ్రామపంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు, డంప్‌షెడ్డు వర్కర్ల తొలగింపు సరికాదు. చేసేందుకు పనులు దొరక్క వేతనం తక్కువే అయినా అంకిత భావంతో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధిని దూరం చేయడం అన్యాయం. మళ్లీ వారిని నియమించి ఉపాధి కల్పించాలి.

–సామేలు, మల్టీపర్పస్ వర్కర్, రొంపేడు

### కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం



ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపిస్తూ పంచాయతీల్లో కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తే ఉద్యమిస్తాం. ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియలో కొందరి పేర్లు తొలగించారు. ఇకనైనా కార్మికులందరి పేర్లు జాబితాలో చేర్చని పక్షంలో నిరవధిక సమ్మె చేయాల్సి వస్తుంది.

–జటంగి వెంకన్న, మల్టీపర్పస్ వర్కర్, పోలారం

# మిగిలింది నాలుగు నెలలే...

- సింగరేణిలో ఇప్పటివరకు 91శాతం బొగ్గు ఉత్పత్తి
- నవంబర్‌లో 99శాతంగా ఉత్పత్తి నమోదు
- భూగర్భ గనుల్లో 78శాతం.. ఓసీల్లో 101శాతం



ఓసీలోని డంపర్‌లో బొగ్గు లోడ్ చేస్తున్న పొక్లెయినర్

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి వ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడగా మిగిలిన నాలుగు నెలల్లో లక్ష్యాన్ని చేరుకోవాలనే భావనతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన సమయంలో 32 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండడంతో రోజువారీ, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను ఏప్రిల్ నుండి నవంబర్ వరకు ఎనిమిది నెలల్లో 43.89 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా 40.15 మిలియన్ టన్నులే(91 శాతం) నమోదైంది. మిగిలిన నాలుగు మాసాల్లో నెలకు 8 మిలియన్ టన్నులు, రోజుకు 2.70 లక్షల టన్నుల ఉత్పత్తి చేయాలి. కానీ ప్రస్తుతం రోజుకు 2.23 లక్షల టన్నులే ఉత్పత్తి జరుగుతుండడంతో లక్ష్యసాధనపై ప్రత్యేక దృష్టి సారించారు.


**నవంబర్‌లో ఇలా..**

గడిచిన నవంబర్‌లో 22 భూగర్భగనులు, 18 ఓపెన్ కాస్టుల ద్వారా 63,72,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 63,10,733 లక్షల టన్నుల ఉత్పత్తి(99శాతం) నమోదైంది. ఓసీల్లో 58,89,000 టన్నుల లక్ష్యానికి 59.34,262 టన్నుల(101శాతం) ఉత్పత్తి సాధిస్తే భూగర్భగనుల్లో మాత్రం 4,83,500 టన్నుల లక్ష్యానికి 3,76,471 టన్నుల(78 శాతం) ఉత్పత్తి చేయగలిగారు. తద్వారా భూగర్భ గనుల్లో 22శాతం వెనుకంజలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**గతేడాది కంటే వెనుకంజ..**

సంస్థ వ్యాప్తంగా గడిచిన ఎనిమిది మాసాల్లో 40.15 టన్నుల బొగ్గు ఉత్పత్తితో 91శాతంగా నమోదైంది. గత ఏడాది ఇదే సమయానికి 43.18 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించారు. అంటే గతేడాదితో పోలిస్తే సుమారు 3.03 లక్షల టన్నులు వెనుకంజలో ఉంది. ఇక గడిచిన ఎనిమిది నెలల్లో ఏరియాల వారీగా పరిశీలిస్తే ఇల్లెందు ఏరియా 23.11లక్షల టన్నుల్లో 29,10,460 లక్షల టన్నుల (126శాతం) బొగ్గు ఉత్పత్తితో సింగరేణి వ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచింది. ఆతర్వాత ఆండ్రియాల 3,46,500 లక్షల టన్నులకు 3,58,609 టన్నులతో రెండో స్థానం దక్కించుకుంది. ఆతర్వాత కొత్తగూడెం ఏరియా 97 శాతం, మణుగూరు 90, బెల్లంపల్లి 91, మందమర్రి 72, శ్రీరాంపూర్ 73, ఆర్జీ–1 89, ఆర్జీ–2 98, ఆర్జీ–3 97, భూపాలపల్లి ఏరియా 74శాతం ఉత్పత్తి సాధించాయి.

### రానున్న నాలుగు నెలలే కీలకం



ప్రస్తుత ఆర్థిక మాసంలో మిగిలిన నాలుగు నెలల్లో ప్రతీ నిముషం విలువైనదిగా భావించి లక్ష్యసాధనకు పాటు పడాలి. ప్రతిఒక్కరు విధిగా ఎనిమిది గంటల పాటు పనిచేయడమే కాక కనీసం 18 గంటలు యంత్రాలు వినియోగించాలి. ఇదే సమయాన నాణ్యత, రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ రోజువారీ లక్ష్యాలను సాధిస్తేనే వార్షిక లక్ష్యాలను చేరుకోవచ్చు.

– ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

### నవంబర్‌లో ఏరియాల వారీగా ఉత్పత్తి వివరాలు

| ఏరియా | లక్ష్యం (టన్నుల్లో) | ఉత్పత్తి (టన్నుల్లో) | శాతం |
|---|---|---|---|
| ఇల్లెందు | 3,02,000 | 4,81,830 | 160 |
| బెల్లంపల్లి | 2,50,000 | 3,38,613 | 135 |
| కొత్తగూడెం | 12,65,500 | 13,73,482 | 110 |
| మణుగూరు | 11,58,500 | 11,91,235 | 103 |
| ఆర్జీ-1 | 4,51,700 | 4,65,234 | 103 |
| ఆర్జీ-3 | 5,68,000 | 5,61,976 | 99 |
| శ్రీరాంపూర్ | 5,75,200 | 5,04,105 | 88 |
| భూపాలపల్లి | 4,41,700 | 3,80,811 | 86 |
| ఆర్జీ-2 | 10,39,000 | 8,01,708 | 77 |
| మందమర్రి | 3,12,500 | 1,88,851 | 60 |
| ఆండ్రియాల | 8,400 | 22,888 | 272 |

### ఉత్పత్తిలో కొత్తగూడెం టాప్

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలో కొత్తగూడెం ఏరియాకు సంబంధించి నవంబర్‌లో 13,73,482 టన్నుల ఉత్పత్తితో రికార్డు నమోదు చేసింది. అలాగే, గడిచిన 110 శాతం సాదించి సింగరేణి వ్యాప్తంగా రికార్డ్ సాధించింది. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 87,02,014 టన్నులు ఉత్పత్తి సాధించింది. మిగతా ఏరియాలతో పోలిస్తే ఇక్కడ ఒక భూగర్భగని, రెండు ఓసీల్లో 2,400 మంది కార్మికులే ఉన్నా గణనీయమైన ఉత్పత్తి నమోదు కావడం విశేషం.